# ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో!

కొచ్చెర్ల కోట వెంకట సుబ్బారావు



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా ఇంకా స్త్రీలు పూజింపబడకపోవటం చూసి పానకాలు కడుపు పాపికొండలంతయ్యింది. కత్తులకు, కఠారులకు పూజలు జరుగుతున్నాయి. రాళ్ళు రప్పలకు పూజలు చేస్తున్నారు. చెట్లు నాటండి అంటూ చెట్టు పుట్టలకు సన్మానం చేస్తున్నారు. నాగుబాములకు గౌరవం దక్కుతోంది. మరి ఆడవాళ్ళను అలా ఎందుకు వదిలేశారు? వాళ్ళకూ పూజలు జరిపిస్తే బాగుంటుంది కదా అని ఆలోచించాడు.

పర్సనల్ సెక్రటరీని పిలిచి "ఏమయ్యా పియ్యే! మా పూర్వీకులెవరో ఆడవాళ్ళ స్వరాజ్యం గురించి కలలు కన్నారట కదా, అది వచ్చే మార్గం ఏదైనా చూడు" అన్నాడు పానకాలు.

"బహుశ గాంధీగారు అయివుంటారండి ఆయన"

"ఆడవాళ్ళను పూజింపమన్నది ఆయనేకదూ పూజిద్దాం."

"ఆమాట ఆయన అన్లేదండి. మరొకాయన అన్నాడు. 'యత్ర నార్యస్తు పూజ్యంతే' అని. ఆడవాళ్ళకు పూజలు జరిగే చోటున దేవతలు నివసిస్తారట"

"అబ్బో! అదేదో చాలా ప్రమాదకరంగా ఉంది. దేవతలు నివసిస్తే మన కొంపలంటుకుంటాయి. దేవుళ్ళ పేరుతో, దేవాలయాల పేరుతో అప్పుడెప్పుడో అంటుకున్న అగ్గి ఇప్పటికీ చల్లారలేదు. మళ్ళీ ఇప్పుడు ఆడవాళ్ళను పూజించడటం మొదలుపెడితే మరి కొంతమంది దేవతలు దిగుమతి అవుతారు. మళ్ళీ మరిన్ని హత్యలు, మర్డర్లు జరిగిపోతాయి."

"పూజ చేయకుండానే మరో ఉపాయం ఉందండి"

"అది బాపూజీ కల కన్నాడా?"

"అవునండి. ఆయనే కన్నాడండి"

"ఏమిటది?"

"అర్థరాత్రి ఆడది ఒంటరిగా నడిరోడ్డులో తిరగటం"

"ఏంటయ్యా! పట్టపగలు తిరుగుతుంటేనే ఇన్ని మానభంగాలు జరుగుతున్నాయి కదా, మరి అర్థరాత్రి తిరిగితే మరిన్ని జరగవూ?"

"జరగవండి. ఎందుకంటే అలా జరక్కుండా ఒక్కో ఆడదానికి ఒక్కో పోలీసుని కాపలా పెడ్తాం కదండి"

"అయితే మన పోలీసులు మగాళ్ళు కాదంటావా?"

"నేను అంత దూరం ఆలోచించలేదండి"

"ఏముందయ్యా అంత దూరం ఆలోచించేందుకు? రోజూ పేపర్లో చూస్తూనే ఉన్నావు కదా!

"అయితే ఆడవాళ్ళకు మానభంగం జరక్కుండా ఆడ పోలీసుల్ని పెడదామండి"

"నీకు బుర్ర లేదయ్యా! ఆడది ఒంటరిగా తిరగాలో అని గోలెత్తుతుంటే మళ్ళీ ఆడ పోలీసుల్ని కాపలా పెడ్తానంటావేంటి?"

పి.ఏ. నాలిక కరుచుకున్నాడు. ఎంత ఆలోచించినా పానకాలుకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. వెంటనే మంత్రిమండలి సమావేశం ఏర్పాటుచేశాడు. "ఆడది అర్థరాత్రి ఒంటరిగా తిరగటం" అనే ఎజండా గురించి చర్చ ప్రారంభమైంది.

"అయినా ఇప్పుడు ఆడది అర్థరాత్రి ఎందుకు ఒంటరిగా తిరగాలి? పగలు తిరుగుతునే ఉందిగా!" అసమ్మతి వర్గం నాయకుడు ప్రశ్న లేవనెత్తాడు.

ఈ అసమ్మతి వర్గం ఎప్పుడూ ఇంతే! తనేదైనా మంచి పని చెయ్యాలనుకుంటే అడ్డుపడి తనకు పేరు రాకుండా చేస్తారు అని పానకాలు లోలోపల గింజుకున్నాడు.

ఎజెండాలో ఉన్న పాయింటు చాలా పవర్ ఫుల్ అయివుంటుంది. అందుకే అసమ్మతివాళ్ళు అడ్డు చెబుతున్నారు అని అతడు నిర్ధారించుకున్నాడు. ఎలాగైనా తీర్మానం పాస్ అవ్వాలని సంకల్పించాడు.

"ఎందుకు తిరగాలో నన్ను అడుగుతారేంటి? గాంధీగారు అన్నారు, ఆయన్ని అడగండి" అంటూ విసురుగా అన్నాడు పానకాలు.

"ఆయన అన్నాడు సరే! మరి మీరెందుకు అమలు పరచాలనుకుంటున్నారూ అని?" అంటూ అసమమ్మతి వర్గం సాగదీసింది.

"మనం అనుభవిస్తున్న స్వరాజ్యం, ఈ పదవులు, ఆయన పెట్టిన భిక్ష మర్చిపోతున్నారా! ఆయన్ని ధిక్కరించటమంటే హైకమాండ్‌ను ధిక్కరించటం లాంటిది. ఏమనుకుంటున్నారో!" అంటూ పానకాలు డబాయించాడు.

ఈయన మాటి మాటికి హైకమాండ్‌ను అడ్డం పెట్టుకుని ఆటలు సాగించుకుంటున్నాడు. ఎలా సాగుతాయో కానీ, చూద్దాం. చాప క్రింద నీరులా మనం ప్రజల్లోకి వెళ్ళమా?

"సరే మీరన్నట్టే ఆడవాళ్ళను ఒంటరిగా తిరగనిద్దాం. కానీ మగవాళ్ళు కూడా అర్ధరాత్రిళ్ళు తిరుగుతుంటారు కదా! మరి వాళ్ళు ఒంటరివాళ్ళు ఎలా అవుతారు?"

పానకాలు ఇరకాటంలో పడ్డాడు. తనకు ఈ పాయింటు తట్టనే లేదు. వెంటనే పి.ఏ. పానకాలు చెవిలో ఏదో ఊదాడు. పానకాలు మొహం వికసించింది.

"అర్ధరాత్రి తిరిగేందుకు ఆడవాళ్ళకే పర్మిషన్ ఇద్దాం. మగవాళ్ళకు కర్ఫ్యూ పెడదాం"

"కర్ఫ్యూ ఒక్క మగవాళ్ళకే పెట్టొచ్చు అని ఎక్కడా లేదు కదా!


"మీరు అర్థం పర్థం లేకుండా వాదించకండి. మనం నగరంలో ఒక్కోసారి ఒక్కో ఏరియాకు పెట్టడంలేదూ! అలానే ఇదీ"

"ఒంటరిగా తిరగాలన్నది కదా బాపూజీ ఆశయం. మరివాళ్ళు గుంపులు గుంపులుగా తిరిగితేనో"

"144 సెక్షన్ పెడదాం"

"మరి ముగ్గురేసి, యిద్దరిద్దరు తిరిగితేనో అందామనుకున్నారు కానీ రూలు ఎమెండ్ చేస్తానంటాడేమోనని ఆ ప్రశ్న వెయ్యలేదు. తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడింది.

మర్నాడు పానకాలు మహిళా సంఘాలతో ఈ విషయం చర్చించాడు.




"ప్రతి మగవాడి విజయం వెనుక ఓ ఆడది ఉంది. ఉయ్యాల ఊపే చేతికి స్వతంత్ర్యం రావాలి. అన్ని హక్కులతో పాటు ఒంటరిగా తిరిగే హక్కు ఆడవాళ్ళకు రావాలి. ఆ హక్కు మా ప్రభుత్వం మీకు కల్పిస్తుంది." అన్నాడు పానకాలు.

ఆడవాళ్ళు విని ఊరుకున్నారు ఎలాంటి ప్రతిస్పందన రాలేదు. ఇలాంటి వాగ్దానాలు, ఉపన్యాసాలు వినివిని విసుగెత్తి ఉన్నారు.

"ఒకప్పుడు మన దేశ ప్రధాని ఒక మహిళ, అలానే బ్రిటన్ ప్రధానమంత్రి మార్గరేట్ థాచర్ కూడా ఒక మహిళే."

కాదని ఎవరన్నారు అనుకుని మహిళలు నవ్వుకున్నారు.

"మార్గరేట్ థాచర్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆమె భర్తను మిస్టర్ మార్గరెట్ థాచర్ అని ప్రజలు సంబోధించేవారు. అయినా శ్రీమతి థాచర్‌కు భర్తంటే ఎంతో గౌరవం. ఇంటర్వ్యూ ఇస్తున్న సమయంలో కూడా "క్షమించండి, ఇప్పుడు నేను నా భర్తగారికి వంట చెయ్యాలి" అని మధ్యలో లేచి వెళ్ళిపోయేది".

పతియే ప్రత్యక్షదైవం అనుకునే ఆడవాళ్ళు ఆ మాట విని 'అబ్బా!' అని విస్తుపోతే, ఆమెకు వంట చేయాల్సిన కర్మ ఏమిటని మరి కొంతమంది గుసగుసలాడారు.

"విదేశాల్లో కూడా స్త్రీలను గౌరవిస్తున్నారు. బెల్జియం మహారాణి గుర్రంబగ్గీపై స్వారీ అయి వెళుతూండగా వెనకా ముందూ ఏడుమంది వాయిద్యాలు వాయించేవారు. వాళ్ళంతా ఆమె మాజీ వర్తమాన, భవిష్యత్తు, భర్తలు: ఆమె రథం దిగుతున్నా వారంతా 'హైలెస్సా'!అంటూ ఆమెను పట్టుకొని కిందకు దింపేవారు" .

ఏం? ఆమె అంత బరువుగా ఉంటుందా!నేను స్లిమ్‌గానే ఉన్నానే, అయినా ఇంకా ప్రధాన మంత్రిని కాలేదేంటబ్బా అనుకుంది ఒకావిడ. రాజకీయ నాయకులు నిజం చెప్పరంటారు ఈయన మాటలు వింటుంటే నిజమనిపిస్తున్నాయి అనుకుంది మరో మహిళ.

"హజ్బెండ్ అంటే ఎవరు? సంసారమనే బ్యాండు వాయించేవాడు. బ్యాండు వాడు ఊరేగింపుకు తగ్గట్టు వాయించాలి కాని తన ఇష్టం వచ్చినట్టు వాయిస్తే ఎలా? ఆడదంటే గృహలక్ష్మి. ఆడది చెప్పినట్టు మగవాడు నడుచుకోవాలి," అన్నాడు పానకాలు.

"అయితే మేము కొన్ని ఉపాయులు చెబుతాం మీరు వాటిని ఆచరణలో పెట్టండి" అంటూ అభ్యర్థించారు మహిళా సంఘంవారు.

"చెప్పండి" అంటూ పానకాలు వినయంగా ముందుకు వంగాడు.

"పదవిని బట్టే వ్యక్తికి గౌరవం. ఆడది ఎంత ఉన్నత పదవిలో ఉంటే మగవాళ్లు అంత ఎక్కువగా గౌరవిస్తారు. భర్త పోలీసు అనుకోండి భార్యను ఎస్సై చెయ్యండి. రోజూ భార్యకు సెల్యూట్ కొడతాడు. భర్త క్లర్క్ అనుకోండి బాస్ చెయ్యండి, గుడ్ మార్నింగ్ చెబుతాడు. భర్త ఎమ్మెల్యే అయితే భార్యను ముఖ్యమంత్రి చెయ్యండి, కాకా పడతాడు. ఇలా ఒక పై మెట్టులో భార్యను పెడితే భర్త ఆమె అడుగులకు మడుగు లొత్తుతాడు.

అలా చేస్తే సంసారాలు సజావుగా జరగటం అటుంచి అంతర్యుద్ధాలు వస్తాయి అనుకుని పానకాలు భయపడ్డాడు.

"ఇంతకన్నా గొప్ప ఉపాయం మా మంత్రిమండలి ఆలోచించింది. అర్థరాత్రి మీకు ఒంటరిగా తిరిగే హక్కు ఇస్తున్నాం" పానకాలు ఆనందంగా ప్రకటించాడు.

"పగలు మగవాళ్లు తిరిగి, రాత్రి ఆడవాళ్లు తిరిగితే సంసారం సజావుగా ఎలా సాగుతుంది?" మహిళలు సందేహం వెలిబుచ్చారు.

"మీరు రాత్రిళ్లు తిరిగి తెల్లవారుజామున ఇంటికొచ్చి పడుకోండి. మగవాళ్లు ముగ్గులేసి, ఇళ్లు సర్ధివంటలుచేసి ఆఫీసులకు వెళతారు."

అసలు మగవాళ్లు రాత్రిళ్లు తిరగటం వల్లే సంసారాలు చట్టుబండలవుతున్నాయి. ఆఫీసు అవగానే మగవాడు ఏ క్లబ్బుకో వెళ్లటం, అక్కడ చీట్లపేక ఆడటం, డబ్బు పోగొట్టుకోవటం, ఆ దిగుల్తో తాగటం, ఆ మత్తులో పెళ్లాన్ని బాదటం, ఇల్లూ ఒళ్లు గుల్ల చెయ్యటం జరుగుతోంది. ఆఫీసు అవగానే బుద్ధిగా ఇంటికొచ్చేస్తే ఈ గొడవలన్నీ ఉండవుగా! అందుకే రాత్రిళ్లు మగవాళ్లకు కర్ఫ్యూ పెడుతున్నాం మీరు మాత్రం స్వేచ్ఛగా తిరగచ్చు, పానకాలు తన సంస్కరణ గురించి వివరించాడు. ఈ పథకం బాగుందని మహిళలకు కూడా అనిపించింది. వెంటనే అది అమలులోకి వచ్చింది.

కొద్దిరోజులు అంతా సవ్యంగానే సాగింది. రాత్రిళ్లు తిరగటం అలవాటు లేని ఆడవాళ్లకు .ఇది వింత అనుభవంగా ఉంది. రాత్రిళ్లు తిరగటం, పగలు పడుకోవటం అదో సుఖాన్ని ఇచ్చింది.

ఆడవాళ్లకు ఊరికినే తిరగటంలో ఆనందం ఏముంటుంది? ఎన్ని రోడ్లని తిరుగుతారు? పైగా షాపులన్నీ మూసి ఉంటాయి. షాపింగ్ చేస్తూ, నెలలు గడపమన్నా గడుపుతారు కాని ఉత్తి పుణ్యానికి తిరగటమంటే ఏం థ్రిల్లు ఉంటుంది?

పాత సామాన్లు అమ్మాలి, కొత్తవి కొనాలి, చీరకని ఒకరోజు, దాని మ్యాచింగ్ జాకెట్టుకు మరోరోజు బజారుకెళ్లాలి. ఇత్తడి సామాన్లు అమ్మి స్టీలు సామాన్లు కొనాలి. బంగారు ఉంగరం అమ్మి గిల్టు నెక్లెస్ కొనాలి. బెండెకు మాటు వేయించటానికి ఆటోలో వెళ్లాలి. వన్‌టౌన్లో బ్లౌజు పీసు కొంటే బీసెంట్ రోడ్డులో స్టిచ్చింగుకు ఇవ్వాలి. ఇన్ని పనులు ఒక్క రెక్కమీద చేయుటం సాధ్యమయ్యేది కాదు. మగతోడు కావాలి. స్కూటరు కావాలి. దానికి డ్రయివర్‌గా భర్త కావాలి ఇవన్నీ లేనప్పుడు అర్థరాత్రి స్వతంత్రం అంధకారమయంగా ఉంది.

"రాత్రిళ్లు షాపులు తెరవాలి పగలు ఎలానూ పడుకుంటాం కాబట్టి అప్పుడు మూసినా పర్వాలేదు."

"కరెంటు కోత రాత్రిళ్లు ఉండకూడదు. ప్రతి రాత్రి దీపావళిలా దీపాలు ధగధగ వెలిగిపోవాలి."

"రాత్రిపూట రిక్షాలు, ఆటోలు, సిటీ బస్సులూ తిరగాలి. ఆడవాళ్లు అటూ, ఇటూ తిరగాలంటే అవన్నీ కావద్దూ!"

"సమాన హక్కులు ఇస్తున్నామంటూ క్లబ్బులు, బార్‌లు మూసివేయుటం ఏమిటి? అలా చేయుటమంటే మమ్మల్ని అవమానించటం కాదా! సినిమా హాళ్లతో సహా అన్నీ తెరచే ఉంచాలి. కావాల్సిన వాళ్లు వాడుకుంటారు."

"వాగ్దానాలు చెయ్యటమే కాని ఇంతవరకు ఆడవాళ్ళ కంటూ ఉద్యోగావకాశాలు కల్పించలేదు. ఇకనైన రాత్రిళ్లు బ్యాంకులూ, ఆఫీసులు, షాపులు తెరచి ఆడవాళ్లకు ఉద్యోగాలు ఇవ్వండి. మేం బయట తిరుగుతూంటే ఇవన్నీ కావద్దూ!"

ఇలా అనేక డిమాండ్లు చేస్తూ మహిళలు ఉద్యమం లేవదీశారు. రాత్రిళ్లు తిరిగే హక్కు ఉండనేఉంది కదాని వాళ్లు మరింత విజృంభించి ప్రభుత్వానికి 'నైట్ మేర్' సృష్టించారు.

రాత్రిళ్లు స్టాండులో ఉన్న బస్సులు తగలడుతున్నాయి. బ్యాంకు దోపిడీలు జరుగుతున్నాయి, కార్లకు, రిక్షాలకు టైర్లలో గాలి ఉండటంలేదు. పార్క్ చేసిన వాటికి పార్టులు ఉండటం లేదు. ఆడవాళ్లు రాత్రిళ్లు చేసిన అగడాల వల్ల పగలు ప్రజా జీవనం అస్తవ్యస్థమవుతోంది. రోడ్లకు గంట్లు పెట్టి ఉండటం, వీధులన్నీ చీపురు కట్టల్తో నిండిపోవటం ఎక్కడ పడితే అక్కడ పెంట పోగులు, పేడకళ్లాబులు అంతా భీభత్సంగా తయారైంది పోలీసు శాఖలో ఆడవాళ్ల సంఖ్య తక్కువ అవటం, మగపోలీసులు తిరగ కూడదనటంతో పరిస్థితి మరింత విషమించింది.


పానకాలకు పునాదులు కదిలిపోయేట్టు అయ్యింది. మహిళా ఉద్యమం వెనక ప్రతిపక్షాల ప్రతీకారం, విదేశీహస్తం ఉందని అనుమానించాడు. కాసేపు పూజ్య బాపూజీ మీద విసుక్కున్నాడు. ఆయనకేం? అర్థరాత్రి తిరగాలన్నాడు. ఇప్పుడు తిరగాలంటే ఎన్ని ఇబ్బందులో! ఆయన చచ్చి స్వర్గాన ఉన్నారు. పోతే, నా పదవేగా! మరుక్షణం తనని తానే తిట్టుకున్నాడు. గాంధీగారు బ్రాందీ మానమంటే మనం మానామా? అసత్యం పలకవద్దంటే ఖాతరు చేశామా? మరి ఆయన చెప్పిన ఈ ఒక్కటే ఎందుకు అమలు పరచాలనుకున్నాం? ఆడది ఒంటరిగా తిరిగితే మనకు నష్టమేమిట్లే అనుకున్నాను కానీ ఇన్ని కష్టాలు ఉంటాయని ఎలా కలకంటాం? రాష్ట్ర జనాభాలో సగం కంటే ఎక్కువమంది స్త్రీలు కాబట్టి వాళ్ల ఓట్లు గుంజేందుకు తను ఈ ప్లాను వేస్తే అది తల్లక్రిందులవటం పానకాలుకు నిజంగా బాధాకరంగా తయారైంది.

ఇది ఇలా ఉండగా మరోవైపు మరో రకమైన ఉపద్రవం ముంచుకు వచ్చింది.

'రాష్ట్రంలో మానభంగాలు ఎక్కువయ్యాయి'

ఆడవాళ్లే తిరుతుంటే మానభంగాలు ఎలా జరుగుతున్నాయి?

'చాలామంది మగవాళ్లు సెక్సు మార్పిడికి ప్రయుత్నిస్తున్నారు.'



ఇలా మగవాళ్లందరూ ఆడవాళ్లు అయిపోతే నాకు ఓటర్లు ఎలా పుడతారు?

'ఆడంగి రేకే మగవాళ్లు ఎక్కువమంది తాయారయ్యారు.'

ఆడవాళ్లు చేసే పనులు చేసి చేసి మగతనం చచ్చి ఉంటుంది. మరైతే మగవాళ్లు చేసే పనులు ఆడవాళ్లు చేస్తున్నారుగా! మరి వాళ్లకు మగతనం రావాలిగా!

ఇంకా చెప్పటానికి అలవికాని సమస్యలు మగవాళ్లు అనుభవిస్తున్నారు.

ఇది ఇలా ఉండగా పెళ్లాలు ఇంట్లో లేకపోవటం వల్ల కొందరు మగవాళ్లు ఆ బాధని తట్టుకోలేక వేషాలు మార్చుకుని ఆడవాళ్లతో కలిసిపోయి రాత్రిళ్లు తిరగటం మొదలుపెట్టారు. ఎవరు ఎవరా అని తెల్సుకోవటం పెద్ద సమస్యగా తయారైంది.

మానవతులైన మహిళలు పానకాల్ని చుట్టుముట్టి- "నీ జిమ్మతియ్యా! నువ్వు రోడ్లమీద తిరగమంటే తిరిగేందుకు మూల కూర్చోమంటే కూర్చునేందుకు వెన్నెముక లేని వాళ్ల మనుకుంటున్నావా! బజారు మనుషులమనుకుంటున్నావా? రాత్రి 10గం॥ లకు భర్తలు కొంపకు చేరితేనే వాళ్లతో వేగలేక ఛస్తున్నాం. ఇప్పుడు ఊరు పొద్దుక్రుంగక ముందే మొగుళ్లు కొంపకు తగలడుతున్నారు. ఆ గిన్నె అక్కడెందుకు పెట్టావు, ఈ తపేళా ఎందుకు సొట్ట పడింది, నెలకు 100 గ్రాముల కాఫీపోడి ఎందుకు, పనిమనిషికి పాయసం పెడతావా, అంటూ రాచి రంపాన పెడుతున్నారు. అప్పుడయితే నిద్రకళ్లతో వచ్చేవాళ్లు, వచ్చీ రాగానే మత్తుగా పడుకునేవాళ్లు. ఇప్పుడు వాళ్లు నిద్రపోరు, మమ్మల్ని నిద్రపోనివ్వరు. ప్రాణాలు తోడేస్తున్నారు. అది కావాలి, ఇది కావాలంటూ వేడి వేడిగా చేయించుకోవటం వేడి చల్లారేందుకు మంచమెక్కటం, ఛస్తున్నామనుకో! అంటూ దుమ్మెత్తిపోశారు.

ఎవరు మొగవాళ్లో, ఎవరు ఆడవాళ్లో తెలియటంలేదు. అందరూ ఆడడ్రస్సు వేసుకు తిరుగుతున్నారు. కాస్త పరిశీలనగా చూసినా పైకి ఏమీతేడాలు కనబడటంలేదు. లోతుగా వెళదామంటే రూల్సు ఒప్పుకోవటంలేదు. ఇలాగైతే ఈ మానభంగాలు, ఈ అక్రమ సంతానాన్ని ఆపటం మాతరంకాదు అంటూ పోలీసు డిపార్టుమెంటు కాళ్లు పారజాపింది.

"కుటుంబ నియంత్రణ పథకాలు అమలు జరపమని మేమంటే జనాభా పెంచే పథకాలు చేపట్టావేమిటి? ఆడా, మగా యిళ్లల్లో ఎక్కువసేపు కలసి ఉంటే కు.ని. పదకం ఖూనీ కాదూ! మన ప్ర.సా.దు. పథకం, గుడుంబా పథకం, క్లబ్బుల పథకం అన్నీ దెబ్బతినవూ! అవన్నీ లేకపోతే మన పార్టీకి కార్యకర్తలు ఎవరుంటారు? గుండాలు ఎక్కణ్ణించి వస్తారు? ఓట్లు ఎవరు వేస్తారు? రిగ్గింగు ఎవరు జరుపుతారు? ఇవన్నీ లేకపోతే అసలు మనం వచ్చే ఎలక్షన్లో ఎలా నెగ్గుతాం" అంటూ హైకమాండ్ పైనుంచి గూటించింది.

ఓరి నాయనో! గాంధీగారంటే ఏంటో అనుకున్నాను. ఆయన దెబ్బకు తట్టుకోలేక తెల్లవాళ్లే పారిపోయారట. నల్లవాడివి నేనెంత? ఆయన ఏ పథకం జోలికి పోయినా చెంప ఛెళ్లుమనేట్టుంది. అందుకే ఆయన ఖాదీ ప్రచారం కానీ, మద్యనిషేదం కానీ దేని జోలికి పోకూడదు. ఎటు నొక్కితే ఎటు ఉబ్బుతుందో, నా బోటిగాడికి బోధపడదు. ఆడవాళ్లను ఉబ్బేసి స్వాతంత్రోద్యమంలో లాగేందుకు ఆయన అలా అని ఉంటాడు. తెల్లవాళ్లకు ఆడవాళ్లంటే కాస్త భయమూ, భక్తీ కదా! అందుకే వాళ్లు 'లేడీస్ఫస్ట్' అంటారు. మనోళ్లు 'లేడీస్ లాస్ట్' అనే పాలసీగాళ్లు. అందుకే 'వస్త్రీ స్వతంత్రమర్హతే' అంటూ వాళ్లకు స్వతంత్రం వద్దు పొమ్మన్నారు. స్వాతంత్రం వచ్చింతర్వాత కూడా ఫారెన్ పాలసీ ఎందుకు, ఇండియన్ పాలసీ అమలు పరుద్దాం.

ఆయుధాల పూజకు దసరా, నాయకుల పూజకు వినాయకచవితి, జంతువుల పూజకు సంక్రాంతి పండగలు పెట్టి శలవలు ప్రకటించారు కదా! అలానే ఆడవాళ్ల పూజకు 'మహిళా దినం' రోజున శలవు ప్రకటిద్దాం. ఆ రోజు మగాళ్లంతా ఇళ్లల్లోనే ఉంటారు కాబట్టి ఆడవాళ్ల పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా సాగిపోతుంది, అనుకుని 'అర్ధరాత్రి ఆడది ఒంటరిగా పథకం వెనక్కులాక్కుని 'నారీపూజ' పథకం అమలు పరిచాడు పానకాలు.

